ప్రజల వినతులపై ప్రత్యేక దృష్టి

• జేసీ కార్తీక్



వినతులు స్వీకరిస్తున్న జేసీ, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: ప్రజలు అందించే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

– ఉపాధి హామీ పనులపై నిఘా పెంచాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేన వ్యవస్థాపకుడు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మొదటి ప్రాధాన్యతిచ్చి ఉపాధి కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జాగుంట పెంచలయ్య, వరలక్ష్మి, ధనమా, రత్నం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు గడువు పెంచాలి



మాట్లాడుతున్న వెంకటరమణయ్య

బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువును పొడిగించాలని న్యాయవాది, బహుజన ప్రజా సంఘం అధ్యక్షుడు ఇర్ల వెంకటరమణయ్య కోరారు. ఈ మేరకు ఆయన అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. సంబంధిత శాఖ మంత్రి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆఫీజ్, ఇమ్మానియేలు, కొండయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

• అదనపు కమిషనర్ నందన్



అర్జీదారులతో మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నిర్ణీత గడువులోగా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 11, హౌసింగ్ 28, టౌన్ ప్లానింగ్ 15, రెవెన్యూ 4, అకౌంట్స్ 9, పబ్లిక్ హెల్త్ 4, అప్కాస్‌వి 2 వినతులందాయి. ఈ సందర్భంగా నందన్ మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్లు, కాలువల మంజూరు, ఆక్రమణలు తదితర వాటిపై వినతులు వచ్చాయన్నారు. ప్రజలు తమ సమస్యలను 94940 18118 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయొచ్చన్నారు. ఇంకా 0861 – 2356777, 0861 – 2316777 హెల్ప్‌లైన్ నంబర్లకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు చెప్పాలని కోరారు. టిడ్కో గృహాలు రద్దయిన వారు చెల్లించిన మొత్తాలను తిరిగి ఇవ్వడంతోపాటు, ఆయా గృహాలను నూతన లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామమోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, డీసీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

• ఆనం విజయకుమార్‌రెడ్డి



బాధితురాలితో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. 26వ డివిజన్‌కు చెందిన పలువురు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేశారనే సమాచారం తెలుసుకున్న విజయకుమార్‌రెడ్డి సోమవారం వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నాం కదా అని బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరూ కూడా భయపడాల్సిన అవసరం లేదని, రూరల్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి



సమావేశం నిర్వహిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సెంట్రల్): సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజతో కలిసి అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలల్లో జిమ్ పరికరాలు, పలు రకాల క్రీడా సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం నగరంలోని గుంతబడిని అధికారులతో కలిసి సందర్శించారు.

➡ సుబేదారుపేటలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి నారాయణ తనిఖీ చేశారు. సమస్యలు తెలుసుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు స్పందన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(టౌన్): స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్మైల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అన్యాయం చేయొద్దు



వినతిపత్రం అందజేస్తున్న రమేష్, నాయకులు

నెల్లూరు రూరల్: ధాన్యం సేకరించడంలో అన్నదాతలకు అన్యాయం చేయొద్దని, వారిని అండగా ఉండాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులో వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానుందన్నారు. అయితే అధికారులు 11 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే సేకరించాలని నిర్ణయించారన్నారు. గత రెండు, మూడు సీజన్లలో బీపీటీ రూ.23 వేలు, కేఎన్ఎం రూ.24 వేలు, ఆర్ఎన్ఆర్ రూ.26 వేలు చొప్పున పుట్టి ధాన్యాన్ని విక్రయించుకున్న రైతాంగానికి నేడు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు. జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేసే అవకాశం లేనందున అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంటను ఎండబెట్టుకునే అవకాశం లేనందున దళారులకు గిట్టుబాటు ధర కంటే తక్కువ రేటుకు విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు నరాల సుబ్బారెడ్డి, అలి రవికుమార్ యాదవ్, కంచర్ల నారాయణ యాదవ్, సీహెచ్ కాలంగి సుబ్బారావు, నారాయణరావు, పి.ప్రశాంత్ పాల్గొన్నారు.

ముసిపల్ స్కూళ్లను అభివృద్ధి చేయాలి

నెల్లూరు(టౌన్): రూరల్ నియోజకవర్గంలో ఉన్న మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలని రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రహంతుల్లా, కిరణ్ కోరారు. సోమవారం మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు.

రౌండ్ టేబుల్ సమావేశం నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 117 జీవోను రద్దు, ఉర్దూ పాఠశాలల బలోపేతం తదితర అంశాలపై మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, రషీద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని భవన నిర్మాణ కార్మికుల భవన్‌లో నిర్వహించే ఈ సమావేశంలో విద్యారంగ నిపుణులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పామూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సు కోసం వినతి

నెల్లూరు సిటీ: నెల్లూరు నుంచి పామూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మేనేజర్ మురళీకృష్ణ డయల్ యువర్ డీఎం–1 కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ఆరుగురు ప్రయాణికులు ఫోన్ చేశారు. ఒకతను కుల్లూరులో నైట్ అవుట్ బస్సును ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా నగరంలో సిటీ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని ఒకరు కోరారు.

ఆటో, ద్విచక్ర వాహనాల చోరీలపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన ఆటో, రెండు ద్విచక్ర వాహనాల చోరీలపై చిన్నబజారు పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్. ఈనెల 13వ తేదీన తన ఆటోలో నెల్లూరు జిల్లా కోర్టుకు వచ్చాడు. పని చూసుకుని బయటకు వచ్చాక ప్రాంగణంలో పార్క్ చేసిన ఆటో కనిపించలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

➡ నగరంలోని బట్వాడిపాళెం సెంటర్‌కు చెందిన వి.వెంకటేష్ ఏసీ కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 25వ తేదీన తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను మార్కెట్‌లోని పబ్లిక్ టాయ్‌లెట్స్ వద్ద పార్క్ చేశాడు. గుర్తుతెలియని దుండగులు దానిని అపహరించగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

➡ పొగతోటకు చెందిన జి.చంద్రశేఖర్ ఎస్2 రోడ్డులోని ఓ దుకాణం సమీపంలో దుస్తుల ఐరన్ షాపు నిర్వహిస్తున్నాడు. గతనెల 14వ తేదీన దుకాణం సమీపంలో టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను పార్క్ చేసి పనిచేసుకుంటుండగా గుర్తుతెలియని దుండగులు దానిని అపహరించారు.

కొనసాగుతున్న బందోబస్తు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఆజాద్ సెంటర్‌లో పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. ఈనెల 16వ తేది అర్ధరాత్రి ఆజాద్ సెంటర్‌లో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటు విషయంలో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నగర డీఎస్పీ పి.సింధుప్రియ నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం కూడా రాకపోకలను నిషేధించడంతోపాటు దుకాణాలు తెరిచేందుకు అనుమతి ఇవ్వలేదు. ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామారావు, రోశయ్య, శ్రీనివాసులురెడ్డి, సాంబశివరావు, సీతారామయ్య, సుధాకర్‌లు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

సమ్మెకు మద్దతుగా..



నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

నెల్లూరు(సెంట్రల్): స్టై ఫండ్ పెంచాలంటూ శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పశు వైద్య విద్యార్థులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా నెల్లూరులోని పశు వైద్య కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఆ శాఖ అధికారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి స్టై ఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధికారులు సోమయ్య, మాలకొండయ్య, రామచంద్రరావు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వదంతులు నమ్మొద్దు



మాట్లాడుతున్న భారత్ వికాస్ పరిషత్ సభ్యులు

నెల్లూరు రూరల్: పాత ములిమూడి బస్టాండ్‌లో వివేకానంద విగ్రహం ఏర్పాటు విషయంలో వస్తున్న వదంతులు నమ్మొద్దని భారత్ వికాస్ పరిషత్ సభ్యులు కోరారు. నగరంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2008లో విగ్రహ ఏర్పాటుకు అనుమతి వచ్చిందన్నారు. స్థానికులతో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బయటి వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని, ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కాకపర్తి జగన్‌మోహన్‌రావు, మహేష్, కాకు మురళీరెడ్డి, కీపూడి బాబు, అలిమెలి శ్రీనివాసులు, కాకపర్తి ప్రదీప్, జెమిలి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన విద్యార్థి విభాగం నేతలు



నెల్లూరు(బారకాసు): నెల్లూరు రాంజీ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని 9వ డివిజన్ విద్యార్థి విభాగం నేత చంద్ర ఆధ్వర్యంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డితో వారు విద్యారంగ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్లో వివిధ విభాగాల అధికారులో వారాంతపు సమీక్షను సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో రోడ్లపై ఉన్న గుంతల వివరాలను నివేదిక రూపంలో అందజేయాలన్నారు. పన్నుల వసూళ్లకు ప్రతి కార్యదర్శి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

లెదర్ క్రాఫ్ట్ షోరూం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలో ఎంజీ మాల్ ఎదురుగా ఎంఎస్ లెదర్ క్రాఫ్ట్ షోరూంను సోమవారం మదీనా వాచ్ అధినేత, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చీఫ్ జనరల్ సెక్రటరీ షేక్ ఇంతియాజ్ సోమవారం ప్రారంభించారు. నాణ్యత కలిగిన లెదర్ వస్తువులను నెల్లూరీయులకు అందించాలన్న సంకల్పంతో, బెంగళూరులోని లెదర్ ఫ్యాక్టరీలో పనిచేసిన అనుభవంతో షోరూంను మొదలుపెట్టినట్లుగా నిర్వాహకుడు ముజీబ్ తెలిపారు.

మార్చిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి మార్చి 9వ తేదీన 105 శంకుస్థాపనలు చేయనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 51 చోట్ల శంకుస్థాపనల్లో తాను పాల్గొంటానన్నారు. మిగిలిన 54 కార్యక్రమాల్లో తన సోదరుడు గిరిధర్‌రెడ్డి పాల్గొంటాడని చెప్పారు. సమావేశంలో మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నాయకుడు షంషుద్దీన్ పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

• జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: 'జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు. పశుసంవర్ధక శాక అధికారులు, డాక్టర్లు అన్ని కోళ్ల ఫారాలను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు' అని జేసీ కార్తీక్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వివిధ అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్, ఎఫ్‌లైన్ సర్వే, ఏపీ సేవ పోర్టల్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన మండలాల్లో ఈకేవైసీ, ఈ–క్రాప్ పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి వివరాలను త్వరగా అందించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలన్నారు. చాలా మండలాలు పనుల కల్పనలో వెనుకబడి ఉన్నాయని, నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు.

చర్యలు తీసుకున్నాం

పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ మాట్లాడుతూ చెక్ పోస్టులు పెట్టి ఇతర జిల్లా నుంచి వచ్చే కోళ్లను తనిఖీ చేసి ఆరోగ్యకరంగా ఉంటేనే అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఉడికించిన చికెన్, కోడిగుడ్లు ఎటువంటి అనుమానం లేకుండా ప్రజలు తీసుకోవచ్చన్నారు. బర్డ్‌ఫ్లూ వదంతులను ఎవరు నమ్మవద్దని, తమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగా భవాని, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ, డీఈఓ బాలాజీరావు, డీసీఓ గుర్రప్ప, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన నిర్మాణాల అనుమతులను పరిశీలించండి

• కమిషనర్ సూర్యతేజ



41వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలోని నూతన నిర్మాణాలను గుర్తించి, వాటిని సంబంధించిన అనుమతులను పరిశీలించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సోమవారం స్థానిక 41 డివిజన్ కోనేటిమిట్ట, సీఎస్ఆర్ ప్లాట్స్, వాకర్స్ రోడ్డు, శివాలయం సెంటర్, ఇరగాళమ్మ గేట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా, ప్లాన్ ప్రకారం లేకుండా జరుగుతున్న నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. దేవదాయ శాఖకు సంబంధించిన స్థలాలను పరిరక్షించుకోవడానికి, శుభ్రంగా ఉంచుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఏఈ, ఈఓలకు తెలియజేయాలన్నారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడిన ఆవును గుర్తించిన కమిషనర్ దాని సంరక్షణ బాధ్యతలను వెంటనే తీసుకోవాలని వెటర్నరీ వైద్యుడ్ని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటాన్ని గమనించిన కమిషనర్ దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్‌సీడీ – సీడీ సర్వే

• డీఎంహెచ్‌ఓ సుజాత



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) – సీడీ స్క్రీనింగ్ 3.0 సర్వే చేయాలని డీఎంహెచ్‌ఓ వి.సుజాత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌సీడీ సర్వేపై పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష జరిగింది.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎన్‌సీడీలో ప్రధానంగా బీపీ, షుగర్, కేన్సర్ తదితర వాటిపై సర్వే చేయాలన్నారు. ఇప్పుడున్న 167 స్క్రీనింగ్ టీంలను 334కి పెంచుతున్నట్టు తెలిపారు. ఆశ, ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్లతో పాటు నర్సింగ్ స్టూడెంట్లు కలిసి ఈ సర్వేను చేస్తున్నారన్నారు. ప్రతి టీం 5 నుంచి 7 ఇళ్లకు వెళ్లి స్క్రీనింగ్ చేయాలన్నారు. అందులో పురోగతి చూపని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంఓ డా.రమేష్, ఎన్‌సీడీపీఓ డా.యశ్వంత్, డెమో అధికారి కనకరత్నం, ఎస్ఓ సహన, యూపీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆదాలను సన్మానించిన నేతలు



ఆదాల, రంగారెడ్డిని సత్కరించిన నాయకులు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం దర్గామిట్ట సరస్వతి నగర్‌లో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసి ఆత్మీయంగా పలకరించారు. 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు షేక్ సలీం తదితరులతో మాట్లాడారు. అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఆదాలను నాయకులు సత్కరించారు.


'రంగడి' బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



గుంజ ప్రతిష్ట

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మార్చి 9 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి గుంజ ప్రతిష్ట (స్తంభ ప్రతిష్ట)ను సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గుంజను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేసి నాటడం జరిగింది. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ వినూత్న ఆలోచన



ముగ్గు వేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సంబంధిత అధికారులు పలుమార్లు చెప్పారు. అయినా కొన్ని ప్రాంతాల్లో పలువురు వ్యర్థాలను ఆరుబయట వేయడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. దీంతో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ వినూత్న ఆలోచన చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే పారిశుద్ధ్య కార్మికులు ఆయా ప్రాంతాలను నీళ్లతో కడిగి, పరిసరాలను శుభ్రపరిచి, రంగవల్లులతో, పూల మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. సోమవారం 18వ డివిజన్ ప్రాంతంలో కార్మికురాలు చెత్త వేస్తున్న ప్రాంతాన్ని నీటితో కడిగి, ముగ్గులు వేసింది.

వెబ్‌సైట్‌లో లేఅవుట్ల వివరాలు

• మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): 'అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దు. అనుమతి ఉన్న లేఅవుట్ల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్ విభాగాధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు తనిఖీలు చేసి దాదాపు 230కుపైగా అనధికార లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. రాబోయే రెండు నెలల్లో ప్రజలు, లేఅవుట్ నిర్మాణదారులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని దరఖాస్తులను పరిష్కరించారు. స్థానిక సంస్థల ద్వారా ప్రజలు చెల్లించే వివిధ రకాల పన్నుల ఆదాయాన్ని స్థానికంగానే ఖర్చు చేసుకునేలా చూస్తామన్నారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, కమిషనర్ సూర్యతేజ, సుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.